## దానాపూర్-బెంగళూరు స్టేషన్ల మధ్య 12 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో దానాపూర్-బెంగళూరు రైల్వే స్టేషన్ల మధ్య 12 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్టు గురువారం రైల్వే అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 7 నుంచి 11 వరకు ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయని తెలిపారు. భువనేశ్వర్-తిరుపతి, పూనే-భువనేశ్వర్, భువనేశ్వర్-బెంగళూరు, విశాఖపట్నం-నాందేడ్, సబల్‌పూర్-నాందేడ్, భువనేశ్వర్-న్యూఢిల్లీ స్టేషన్ల మధ్య నడుస్తున్న 18 ఎక్స్‌ప్రెస్ రైళ్లలో తాత్కాలికంగా అదనపు బోగీలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ నెల 4 నుంచి 31 వరకు ఆయా రైళ్లలో అదనపు బోగీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆయా స్టేషన్ల మధ్య ప్రయాణికుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వివరించారు.

# అనర్హులకు 300 కోట్లు రుణాలు

- మహేశ్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో భారీ అక్రమాలు
- 1800 మందికి డమ్మీ గోల్డ్ లోన్స్ : ఈడీ

హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని మహేశ్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో భారీ అక్రమాలు జరిగాయని ఈడీ అధికారులు స్పష్టంచేశారు. బుధ, గురువారాల్లో హైదరాబాద్‌లోని ఏడు ప్రాంతాల్లో సోదాలు చేసి రూ.కోటి నగదుతో పాటు రూ.5 కోట్ల విలువైన ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. అనర్హులకు రూ.300 కోట్ల రుణాలు ఇచ్చినట్టు గుర్తించామని తెలిపారు. 1800 మందికి డమ్మీ గోల్డ్ లోన్స్ ఇచ్చినట్టు తమ సోదాల్లో తేలిందన్నారు. రుణాలన్నీ బినామీల పేర్లతో కుటుంబసభ్యులే తీసుకున్నారని తెలిపారు. తప్పుడు ఆస్తి పత్రాలతో భారీ రుణాలు మంజూరు చేశారని, వక్ఫ్ బోర్డ్ ఆస్తులకు లోన్స్ ఇచ్చారని ఈడీ పేర్కొంది. మహేశ్ కో-ఆపరేటివ్ బ్యాంకులో రూ.300 కోట్ల నిధుల గోల్‌మాల్‌కు సంబంధించి బ్యాంకు ప్రమోటర్ల ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ సోదాలు నిర్వహించింది. బ్యాంకు చైర్మన్ రమేశ్‌కుమార్ బంగ్, వైస్ చైర్మన్ పురుషోత్తమదాస్, ఎండీ ఉమేశ్ చంద్‌కు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు చేసిన ఈడీ బృందాలు కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలను సేకరించాయి.

## వయనాడ్ బాధితులకు విరివిగా విరాళాలివ్వండి: సీపీఎం

హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ) : వయనాడ్ బాధితులను ఆదుకోవడానికి విరాళాలు అందించాలని సీపీఎం కేంద్ర కమిటీ గురువారం పిలుపునిచ్చింది. రాష్ట్రంలో పార్టీ శ్రేణులు ఆగస్టు 2,3,4 తేదీల్లో విస్తృతంగా కదిలి విరాళాలు సేకరించి కేంద్రానికి పంపాల్సిందిగా సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. దాతలు పార్టీ కేంద్ర కార్యాలయం 'వయనాడ్ ప్రత్యేక నిధి' విరాళాల కోసం ఏర్పాటు చేసిన అకౌంట్‌కు పంపాలని తమ్మినేని వీరభద్రం సూచించారు.



## యాదాద్రీశుడికి అరకిలో బంగారం విరాళం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్య విమాన గోపురం బంగారు తాపడానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు భారీ విరాళం సమర్పించారు. అనురాధ, రాంరెడ్డి దంపతులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి గురువారం ఆలయ ఈవో భాస్కర్‌రావుకు అరకిలో బంగారాన్ని అందజేశారు. కుటుంబంతో వచ్చి స్వామివారికి బంగారం సమర్పించుకుని మొక్కు చెల్లించుకున్నట్టు రాంరెడ్డి తెలిపారు.

- యాదగిరిగుట్ట




















